

నేడు 'ఆకొండి' ట్రస్ట్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా

ప్రజాశక్తి-అమలాపురం

అమలాపురానికి చెందిన ఆకొండి సింహాచలం సర్వీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌కి చెందిన అంజనాస్ ఫౌండేషన్ సహకారంతో రోటరీ క్లబ్ నందు జాబ్ మేళా గురువారం నిర్వహించనున్నారు. 18 నుంచి 26 సంవత్సరంలోపు నిరుద్యోగ యువత జాబ్ మేళాలో పాల్గొనవచ్చుని నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ జాబ్ మేళా నందు అరవింద్ టెక్స్టైల్స్, టాటా విస్టా, అశోక్ లేలాండ్, శ్రీ దుర్గా ఫార్మ కంపెనీ, అపోలో ఫార్మసీ, బజాజ్ అలియాంజ్, ఎస్బిఐ లైఫ్ నుంచి వివిధ స్థాయి అభ్యర్థుల్ని ఎంపిక చేసుకోవడానికి ఆయా సంస్థలు వారు విచ్చేస్తున్నారని నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. జాబ్‌మేళాలో పాల్గొనదలచిన వారు మూడు పాస్‌పోర్ట్ ఫొటోలు, లేటెస్ట్ రెస్యూమ్ రెండు కాపీలు, మార్క్ లిస్టు కూడా తీసుకురావాలని అన్నారు

క్రికెట్ హోరు.. బెట్టింగ్ జోరు

- యువతను పీడిస్తున్న బెట్టింగ్ భూతం
- పట్నం నుంచి పల్లెకు విస్తరించిన వైనం



ప్రజాశక్తి- రాజోలు

సార్వత్రిక ఎన్నికల ప్రకటనతో రాజకీయ హోరు కొనసాగుతోంది. దీనికి క్రికెట్ జోరు జతయింది. ఇండియన్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ సమరం మొదలైంది. దేశంలో ఎక్కువ మంది ఆదరించే క్రికెట్ పోటీలు ఓవైపు.. దేశ భవిష్యత్తును నిర్ణయించే ఎన్నికలు మరోవైపు కొనసాగనుండటంతో పల్లెలు, పట్టణాలనే తేడా లేకుండా సందడి వాతావరణం నెలకొంది. గతంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల్లో క్రికెట్ బెట్టింగ్‌కు బానిసై ఎంతోమంది యువత ఇబ్బందులు ఎదుర్కొన్న సందర్భాలు ఉన్నాయి. దీనిపై పోలీసులు దృష్టి సారించాలి.

బెట్టింగ్ అంతా ఫోన్‌లోనే..

సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్నకొద్దీ బెట్టింగ్‌రాయుళ్లు తమ పంథా మార్చుకుంటున్నారు. పోలీసు శాఖ కఠిన చర్యలు తీసుకోవటంతో ఎవరి ఫోన్‌లో వారే బెట్టింగులకు పాల్పడుతున్నారు. శాసన సభ, లోక్‌సభ ఎన్నికలతో పాటు ఐపీఎల్ మ్యాచ్‌లు జరగనుండటంతో వీటిపై బెట్టింగ్ జోరుగా సాగే అవకాశముందని తెలుస్తోంది. ఐపిఎల్‌లో ఏ జట్టు గెలుస్తుంది? ఏ బాల్‌కు ఎన్ని పరుగులు చేస్తారు? ఎవరి వికెట్ ఎవరు తీస్తారు? ఇలా రకరకాల అంశాలపై పందెం కాస్తారనే అంచనాలున్నాయి.

ఆన్‌లైన్ పేమెంట్ అందుబాటులోకి వచ్చాక..

కొన్నేళ్ల క్రితం వరకూ మ్యాచ్ ఫలితాలపై మాత్రమే బెట్టింగ్ సాగేది. కానీ ఇప్పుడు బంతి బంతికీ బెట్టింగ్ జరుగుతోంది. ఆన్‌లైన్ పేమెంట్లు ఊపందుకున్నప్పటి నుంచి జూదం జోరందుకుంది. క్రికెట్ బెట్టింగ్‌పై ఆసక్తి పెరగటంతో యాప్ నిర్వాహకులు ఇదే అదనుగా పెద్దమొత్తంలో డబ్బులు దండుకుంటున్నారు. మైనర్ లు సైతం బెట్టింగ్‌కు పాల్పడి రూ.లక్షల్లో నష్టపోయిన ఉదంతాలు గతంలో చోటుచేసుకోవటం విచారకరం.బెట్టింగ్ కు పాల్పడి ప్రాణాలు కొల్పపోయిన ఘటనలు మన జిల్లాలో అనేకం.

ఎన్నికలపైనా ప్రభావం

ఏ ఎన్నికలైనా యువత పాత్రే కీలకం. ఓటర్లను చైతన్యపరచటం, ప్రజల అవసరాల గుర్తింపుతో పాటు ఓటర్లు ఎటువైపు మొగ్గు చూపుతున్నారన్న సరళిని ఆయా పార్టీల అభ్యర్థులు.. యువత ద్వారానే తెలుసుకుంటారు. ఐపిఎల్ మ్యాచులు చూసేందుకు టివిలకు యువత అతుక్కుపోతే పార్టీ పనులు ఎవరు చేస్తారనే అంశం నాయకుల్లో చర్చనీయాంశమవుతోంది. అయితే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈసారి ఐపీఎల్ మ్యాచ్‌లను దశల వారీగా నిర్వహించనున్నట్లు తెలుస్తోంది.

బెట్టింగ్‌కు పాల్పడితే కఠినచర్యలు



బెట్టింగ్ యాప్‌లను నమ్మి యువత మోసపోవద్దు. ఆన్‌లైన్ జూదం మోసపూరితమైంది. జీవితాలను నాశనం చేసుకోవద్దు. నిర్వాహకుల సూచనల ప్రకారమే బెట్టింగ్ యాప్స్ నడుస్తాయనే విషయాన్ని విస్మరించవద్దు.

- జి.పృథ్వీ, ఎస్ఐ, రాజోలు

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

ప్రజాశక్తి-అమలాపురం

సార్వత్రిక ఎన్నికలు శాంతియుత వాతావరణంలో నిష్పక్షపాతంగా సజావుగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీ లు పోటీ చేయనున్న అభ్యర్థు లు జిల్లా యంత్రాంగానికి పూర్తిగా సహకరించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వర్లు కోరారు. బుధవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్లోని డిఆర్ఓ ఛాంబర్ నందు జిల్లా స్థాయిలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి ఈ వారం ఎన్నికలకు సంబంధించి చేపట్టిన ప్రక్రియను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా జరగాలంటే సరైన ఓటరు జాబితా ప్రాథమిక అవసరమన్నారు ఎన్నికల ప్రక్రియ సక్రమంగా సాగేటట్లు చూడడంలో రాజకీయ పార్టీలతో పాటుగా పౌర సమాజం పాత్ర కూడా ముఖ్యమ న్నారు. ఓటర్లు తమ ఓటు హక్కును నిష్పక్షపాతంగా నిర్భయంగా వినియోగించుకోవడం ఎంత అవసరమో ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు జరిగేటట్లు సహకరించడం కూడా అంతే అవసరమన్నారు. ఎన్నికలు సజావుగా శాంతియుతంగా జరగడానికి కట్టుదిట్టమైన చట్టాలను ఎన్నికల కమిషన్ ప్రవేశపెట్టిందన్నారు. కులం మతపరమైన భావాల పరంగా అభ్యర్థనలు చేయకూడదని ఆయన స్పష్టం చేశారు. పోలింగ్ పూర్తవ డానికి నిర్ణయించిన సమ యానికి ముందు 48 గంటల కాలంలో మీటింగులు నిర్వహించ రాదన్నారు. సభలు ఏర్పాటు చేసి సందర్భంలో లౌడ్ స్పీకర్లు సంబం ధించి ముందుగా అనుమతులు పొందాల్సి ఉంటుందన్నారు. ఊరేగింపులకు సంబంధించి మొదలయ్యే సమయం వెళ్లే మార్గం ఊరేగింపు ముగింపుకు వచ్చే సమయం ప్రదేశం వగైరా విషయాలను దరఖాస్తులో కచ్చితంగా పేర్కొనాలన్నారు పోలింగ్ రోజున ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛాయుతంగా వినియోగించుకోవడానికి ప్రశాం తంగా పోలింగ్ జరగడానికి ఎన్నికల విధులలో ఉన్న అధికారులకు పూర్తిగా సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ తరపున కామన ప్రభాకర్ రావు, బిజెపి తరపున దూరి రాజేష్, సిపిఎం తరపున కారెం వెంకటేశ్వరరావు, బహుజన సమాజ్ పార్టీ తరపున కాశీ లక్ష్మీ భవాని ఎన్నికల సెక్షన్ సూపరింటెండెంట్ టి.వైద్యనాథ శర్మ సిబ్బంది రవిశంకర్ బాబ్జి తదితరులు పాల్గొన్నారు.



వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న డిఆర్ఒ ఎం. వెంకటేశ్వర్లు

అర్చకులపై దాడికి సిపిఎం ఖండన

చర్యలు తీసుకోవాలని డిమాండ్

ప్రజాశక్తి-అమలాపురం

అర్చకులపై దాడికి పాల్పడిన వైసిపి మాజీ కార్పొరేటర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు డిమాండ్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కాకినాడ నగరం దేవాలయం వీధిలో ఉన్న శివాలయంలో పూజారి వెంకట సత్యసాయిని అసభ్య పదజాలంతో దూషిస్తూ, చెంపపై కొట్టడం, కాలితో తన్నడం లాంటి చర్యలకు పాల్పడిన వైసిపి మాజీ కార్పొరేటర్ సిరియాల చంద్రరావుని తక్షణం అరెస్ట్ చేయాలని కారెం వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. అధికార మదంతో దేవాలయ పూజారులపై దాడులు చేయడం, దుర్భాషడేవారిపట్ల ఉదారంగా వ్యవహరించడం తగదని అధికార పార్టీని హెచ్చరించారు. దాడికి పాల్పడిన వైసిపి మాజీ కార్పొరేటర్ సిరియాల చంద్రరావుని అరెస్ట్ చేయకుండా దేవాదాయ శాఖ అధికారుల ద్వారా రాజీ నాటకాలు ఆడించారని, రహస్యంగా క్షమాపణ చెప్పించడం విడ్డూరంగా ఉందని వాపోయారు. తాను క్షమాపణ చెప్పలేదని చంద్రరావు బహిరంగంగా ప్రకటించడం, ప్రాణహాని ఉందని పూజారి కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేయడం చూస్తుంటే నామమాత్రపు 47ఎ సెక్షన్ కింద కేసు నమోదు చేయడం బాధితులకి విశ్వాసం కలిగించదన్నారు. పూజారి కుటుంబానికి రక్షణ కల్పించాలని కారెం వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ ఘటన ఆసరా చేసుకొని కొన్ని స్వార్థపర రాజకీయ శక్తులు మత ఉద్రేకాలు సృష్టించే ప్రయత్నాలను అధికార యంత్రాంగం నిరోధించాలని కోరారు.

ముగిసిన పది పరీక్షలు

ప్రజాశక్తి-ముమ్మిడివరం

జిల్లా వ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ముగిశాయని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా విద్యా శాఖాధికారి ఎం. కమల కుమారి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 112 పరీక్షా కేంద్రాల్లో 19608 మంది పరీక్షకు హాజరు కావలసి ఉండగా 19072 మంది హాజరు కాగా 536 మంది గైర్హాజరు అయ్యినట్లు ఆమె తెలిపారు. మండలంలో 733 మంది విద్యార్థులకు 721 మంది హాజరు కాగా 12 మంది గైర్హాజరు అయినట్లు తెలిపారు.జిల్లా వ్యాప్తంగా 47 కేంద్రాల్లో తనిఖీలు చేపట్టామన్నారు. డిఇఒ 7చోట్ల, ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ 5 చోట్ల, డివైఇఒ 4 చోట్ల, ఫ్లయి ంగ్ స్క్వాడ్ 31 చోట్ల తనిఖీలు చేపట్టినట్లు సంబంధిత అధికారులు తెలిపారు.**అంబాజీపేట** మండల పరిధిలో పది పరీక్షలకు ముగ్గురు విద్యార్థులు గైహాజరైనట్లు ఎంఇఒలు కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్‌లు తెలిపారు. బుధవారం జరిగిన పది పరీక్షలకు అంబాజీపేట సెంటర్ లో142 మంది, తొండవరం సెంటర్‌లో 158 మంది, పుల్లేటికుర్రు సెంటర్ లో186 మంది విద్యార్థులు పరీక్షలకు రాశారన్నారు.

ఎన్నికల ట్రైనర్లకు నియామకం

ప్రజాశక్తి - అంబాజీపేట

జిల్లా స్థాయి వివిధ డిపార్ట్‌మెంట్లకు సంబంధించి ఎన్నికల శిక్షణ ఇవ్వడానికి అంబాజీపేట ఎంఇఒ-2 మోకా ప్రకాష్ మరియు పుల్లేటికుర్రు హైస్కూల్ ఇంగ్లీషు అసిస్టెంట్ ఎ.సాయిరాంలను జిల్లా కలెక్టర్ నియమించి నట్లు మండల విద్యాశాఖాధికారులు కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్ లు బుధవారం తెలిపారు.

ఘనంగా నూకాలమ్మ విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి - ఆలమూరు

మడికి నూకాలమ్మ కాలనీలో టిటిడి, ప్రజ విరాళాలతో నిర్మించిన నూకాలమ్మ అమ్మవారి ఆలయం, విగ్రహ ప్రతిష్టాపన కాళ్ళకూరి కామేశ్వర శర్మ వేద మంత్రాల మధ్య బుధవారం ఘనంగా నిర్వహించారు. సుమారు 400 మంది మహిళలు గోదావరి జలాలతో గ్రామోత్సవం నిర్వహించి అమ్మవారికి జలాభిషేకం చేశారు. ఈ విగ్రహ ప్రతిష్టాపనకు ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డి హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఎంఎల్ఎ చిర్లకు ఆలయ వేద పండితులు స్వాగతం పలికారు. అనంతరం ఆల యం వద్ద అన్న దానం నిర్వహించారు. కార్యక్రమంలో సింగి రెడ్డి వీరబాబు, యనమదల నాగేశ్వ రరావు, పడమటి రాంబాబు, మండల వైసిపి కోఆర్డి నేటర్ తమ్మన శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

కేశవరంలో మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం

ప్రజాశక్తి-మండపేట

మండలంలోని కేశవరం గ్రామంలో 6వ బూత్ పరిధిలో మేము సిద్ధం మా బూత్ సిద్ధం కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా రైతు విభాగం కార్యదర్శి అద్దంకి రమణ మాట్లాడుతూ మాట్లాడుతూ సమిష్టి కషితోనే వైసిపి విజయం సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో మండల జెసిఎస్ ఇంచార్జ్ బందెల సాయిరామ్, బూత్ కన్వీనర్ మనువర్తి యేసురాజు, సమతం పెద్ద పాపారావు తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



అధికారంలోకొచ్చాక మా సారు ఏం చేయడం లేదంటావేమయ్యా..? రోజుకు రెండు పనులు చేస్తూంటేనూ..!!!

బాలబాలాజీ హుండీల లెక్కింపు

ప్రజాశక్తి-మామిడికుదురు

అప్పనపల్లి శ్రీ బాలబాలాజీ హుండీల ఆదాయం 54 రోజులకు రూ.27,06,106, అన్నదాన హుండీల ద్వారా రూ.61,702 మొత్తం రూ.27 67,808 ఆదాయం వచ్చి నట్లు ఆలయ సహాయ కమిషనర్ గ్రంధి మాధవి బుధవారం తెలిపారు జిల్లా దేవదాయ సహాయ కమిషనర్ దూనబోయిన నాగ మల్లేశ్వరరావు, అమలాపురం తనిఖీ దారు జె.రామలింగేశ్వర్రావుల పర్య వేక్షణలో హుండీల లెక్కింపు జరిగింది ఈ లెక్కింపు లో 10.300గ్రాముల బంగారం, 1కేజీ 157గ్రాముల వెండి సమకూరిందన్నారు. అర్చకులు, సేవా సంఘ సభ్యులు, ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



లెక్కింపు నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది తదితరులు

రామ్‌చరణ్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-యంత్రాంగం

సినీనటుడు కొణిదెల రామ్‌చరణ్ పుట్టినరోజు వేడుకలను ఆయన అభిమానులు బుధవారం ఘనంగా నిర్వహించారు.

అమలాపురం రాంచరణ్ పుట్టినరోజును పురస్కరించుకుని అమలాపురంలో బుధవారం నిర్వహించారు. చిరంజీవి యువత ఆధ్వర్యంలో పట్టణంలోని స్థానిక లూయి అంధుల పాఠశాలలో కేకు కోసి వేడుకలు నిర్వహించి అనంతరం పలు సేవాకార్యక్రమాలు నిర్వహించారు. అమలాపురం చిరంజీవి పట్టణ యువత అధ్యక్షుడు నల్లా చిట్టిబాబు, అఖిల భారత చిరంజీవి యువత ఉపాధ్యక్షుడు యేడిద శ్రీను, నల్లా నాయుడు, ఉద్దిశపు చిన్న, వాకాడ సుబ్రహ్మణ్యం, పోలిశెట్టి రాము మరియు అధిక సంఖ్యలో మెగా అభిమానులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. **మండపేట** స్థానిక 7వ వార్డులోని ఆదర్శ హెల్పింగ్ హాండ్స్ సంస్థలో బుధవారం రామ్ చరణ్ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. మండపేట మెగా ఫ్యామిలీ యువత అధ్యక్షులు కె. నాగేంద్ర ప్రసాద్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వృద్ధుల సమక్షంలో కేక్ కట్ చేసి వేడుకలు జరిపారు. అనంతరం ఫ్యాన్స్ అంత కలిసి వద్దులకు వడ్డన చేశారు. ఈ కార్యక్రమంలో జన సేన పార్టీ నాయకులు శెట్టి రవి, పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ అధ్యక్షులు మామిడాలా మనో కష్ణ, మోరం బాలాజీ, బండారు సతీష్, సాధనాల రాజు, బళ్ళ రాజు తదితరులు పాల్గొన్నారు.



మండపేట ఆదర్శ హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో వేడుకలు

జనసేన పార్టీని వీడను : బొంతు

ప్రజాశక్తి-రాజోలు

తాను జనసేన పార్టీని వదలి వేరే ఏపార్టీలోను చేరే ప్రసక్తి లేదని జనసేన నాయకులు బొంతు రాజేశ్వరరావు అన్నారు. బుధవారం మలికిపురంలో స్వగృహం వద్ద ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో బొంతు రాజేశ్వరరావు మాట్లాడుతూ తాను జనసేన నుండి వైసిపి లో చేరుతున్నట్లు, ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేయనున్నట్లు కొంతమంది వ్యక్తులు చేస్తున్న అసత్య ప్రచారాలు తన మనోభావాలు, ఆత్మాభిమానం దెబ్బతీసేలా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాజోలు లో ఎక్కువ సార్లు ప్రతి గడపగడపకూ వెళ్ళిన నాకు ప్రజలతో అందరికంటే ఎక్కువ సంబంధాలు వున్నాయని అన్నారు. తాను పార్టీ మారుతున్నట్లు వస్తున్న వార్తలలో నిజం లేదని అన్నారు. పవన్ కళ్యాణ్ తనకు న్యాయం చేస్తానని మాట ఇచ్చారన్నారు. కార్యక్రమంలో మలికిపురం ఎంపిపి మేడిచర్ల సత్యవాణి, రాజోలు మండల వైస్ ఎంపిపి ఇంటిపల్లి ఆనంద రాజు, మలికిపురం మండల అధ్యక్షులు మల్లిపూడి సత్తిబాబు, రాజోలు మండల అధ్యక్షులు సూరిశెట్టి శ్రీనివాసరావు, కాకర శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

ఎన్.కొత్తపల్లి పంచాయతీ నల్లావారి పేటలో బుధవారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ వైసిపి అభ్యర్థి పినిపే విశ్వరూప్, మంత్రి సతీమణి బేబీ మీనాక్షి, అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గం వైసిపి అభ్యర్థి రాపాక వరప్రసాద్ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. తొలుత అనాతవరం నుంచి ఎన్.కొత్తపల్లి వరకు మోటారు సైకిళ్ళు, కార్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. గ్రామంలో ప్రజలను కలిసి సిఎం జగన్ పాలనలో జరిగిన సంక్షేమ పథకాలను అభివృద్ధిని ప్రజలకు వివరించారు. వచ్చే ఎన్నికల్లో వైసిపిని గెలిపించాలని కోరారు.

గ్రామంలోని అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించి అంబేద్కర్ ఆలోచన విధానంలో మెలగాలని వారు సూచించారు. కార్యక్రమంలో ఎం ఎల్ సి బొమ్మి ఇజ్రాయిల్, వైస్ ఎంపిపి సాదే శ్రీనివాసరావు, జెడ్‌పిటిసి సభ్యుడు గెడ్డం సంపదరావు, సర్పంచ్‌ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు, ఎంపిటిసిల సమాఖ్య మండల అధ్యక్షుడు పెట్టా అప్పారావు, సర్పంచ్‌లు కుంచే చిట్టికుమారి,జొన్నాడ శ్రీదుర్గ,యర్రంశెట్టి రామచంద్రరావు, పెయ్యల రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి

ప్రజాశక్తి -కొత్తపేట

ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించు కావాలని ఎఎల్ఎస్ కోఆర్డినేటర్ రమేష్ బాబు అన్నారు. బుధవారం వాడపాలెం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల లో అవగాహనా కార్యక్రమాలు ర్యాలీలు నిర్వహించారు. 2011లో భారత్ ఎన్నికల సంఘం ద్వారా క్రమబద్ధకరమైన ఓటర్ విద్య ఎన్నికల భాగస్వామి కార్యక్రమం స్వీప్ ప్రారంభించిందన్నారు. జిల్లా ఎన్నికల స్వీప్ ఎంఎన్సు మోడల్ అధికారి ఎఎల్ఎస్ఒ కోఆర్డినేటర్ రమేష్ బాబు పేర్కొన్నారు స్థానిక జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల వాడపాలెం లో స్వీప్ కార్యక్రమాన్ని టీచర్లతో నిర్వహించారు ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ స్వీప్ కార్యక్రమం వరుసగా మంచి ఫలితాలు సాధిస్తుందని సూచించారు. ఓటు ప్రాముఖ్యతను తెలియజేసేందుకు ప్రజాస్వామ్యం ప్రక్రియలో ఓటర్లు అత్యధిక సంఖ్యలో పాల్గొనేలా ప్రోత్సహించేందుకు స్వీప్ తోడ్పడుతుందన్నారు ఓటర్ల చైతన్యం ప్రచారంలో కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ ప్రజాస్వామ్య లో నిర్మాణానికి ఓటు హక్కు చాలా విలువైందని అన్ని వర్గాల ప్రజలు తమ పవిత్రమైన ఓటును వినియోగించుకోవాలన్నారు



వాడపాలెం జెడ్‌పి ఉన్నతపాఠశాల్లో అవగాహనా కార్యక్రమం

'వివేకానంద'లో ఒలింపియాడ్ కోర్సులు ప్రారంభం

ప్రజాశక్తి-రామచంద్రపురం

పట్టణంలో గల వివేకానంద స్కూల్లో ఈ ఏడాది నుంచి ఒలింపియాడ్, నీట్ కోర్సులు, ఎన్ సి ఇ ఆర్ టి సిలబస్ లో ప్రారంభిస్తున్నామని కరస్పాండెంట్ బిఎస్.సరోజిని, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శైలుషా బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. పట్టణంలో తమ పాఠశాల ప్రారంభించి స్నాతకోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామని ఈ సందర్భంగా వారు తెలిపారు. ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా ప్రముఖ రచయిత ప్రొఫెసర్ సివిల్ ఇంజనీరింగ్ డైరెక్టర్ ఆఫ్ అకాడమిక్స్ అండ్ ప్లానింగ్ జెఎన్‌టియు కాకినాడ నుంచి డాక్టర్ కెవిఎస్‌జి.మురళీకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని వారు వివరించారు. అదేవిధంగా విద్యార్థులను ప్రోత్సహిస్తూ చదివించడమే తమ ముఖ్య ఉద్దేశమని అకాడమిక్ డీన్ చైర్మన్ సిహెచ్.వెంకటేశ్వరరావు ఈ సందర్భంగా వివరించారు తమకు కాకినాడ ఇంద్ర పాలెం మధురానగర్ సామర్లకోట రాయవరం రామచంద్రపురం బ్రాంచ్లో నూరు శాతం విద్యార్థులు విజయాలు సాధిస్తూ విజయవంతంగా నడుపుతున్నామన్నారు. కార్యక్రమానికి పలువురు ఉపాధ్యాయులు హాజరయ్యారు. అదేవిధంగా వార్షికోత్సవం వేడుకల్లో ముఖ్య అతిథులుగా సిఐపి దొరరాజు , ఎంఇఒ ఎం.శ్రీనివాసు తదితర పట్టణ ప్రముఖులు విద్యావేత్తలు పాల్గొంటారని విద్యార్థుల తల్లిదండ్రులు, ఆహుతులు కార్యక్రమంలో పాల్గొనాలని ఈ సందర్భంగా వారు విజ్ఞప్తి చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న వివేకానంద స్కూల్ కరస్పాండెంట్ సరోజిని, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శైలుషా

రెడ్డి సుబ్రహ్మణ్యానికి పలువురి అభినందన

ప్రజాశక్తి-అంబాజీపేట

టిడిపి రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యునిగా నియమితులైన రెడ్డి సుబ్రహ్మణ్యంను బుధవారం ఆయన స్వగృహంలో రాష్ట్ర టిడిపి బిసి సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ చిన్నం బాల విజయారావు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు మర్యాద పూర్వకంగా కలిశారు. సుబ్రహ్మణ్యంకు పూలమాలలు వేసి సత్కరించారు. ఎన్‌టిఆర్ యువశేన అధ్యక్షులు వక్కలంక బుల్లియ్య మాట్లాడుతూ టిడిపి రెడ్డి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో విజయ సోపానం వైపు పయనిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వారి వెంట పుల్లేటికుర్రు సర్పంచ్ జల్లి బాలరాజు, రాష్ట్ర ఎంబిసి సభ్యులు యడ్లపల్లి తుక్కియ్య, డాక్టర్ సెల్ అధ్యక్షులు గెల్లా అశోక్, మోకా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట టిడిపి పొలిట్ బ్యూరో సభ్యునిగా నియమితులైన రెడ్డి సుబ్రహ్మణ్యం కు టిడిపి, జనసేన, బిజెపి పార్టీల కొత్తపేట నియోజకవర్గ ఎంఎల్ఎ అభ్యర్థి బండారు సత్యానందరావు, పార్లమెంట్ అభ్యర్థి గంటి హరీష్ మాధుర్ శుభాకాంక్షలు తెలిపారు. కొత్తపేటలోని ఆర్ఎస్ స్వగృహానికి బండారు సత్యానందరావు, హరీష్ మాధుర్ వెళ్లి అభినందనలు తెలిపారు. అనంతరంపూలమాలలతో ఆర్ఎస్ దంపతులను సత్కరించారు. ఈకార్యక్రమంలో కంఠంశెట్టి శ్రీనివాసరావు, నల్ల రమణ, సిద్ధాబత్తుల బహుదూర్ అత్తిలి వేంకటేశ్వరావు రిశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలో పలువురి చేరిక

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

వానపల్లిపాలెం లో బుధవారం టిడిపి మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ అధ్యక్షతన పార్టీ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో స్థానిక సర్పంచ్, టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు నల్లా బాపండి ఆధ్వర్యంలో మండలంలోని పలువురు టిడిపిలో చేరారు.వీరికి అమలాపురం నియోజకవర్గ కూటమి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు టిడిపి కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి సభ్యుడు దేశంశెట్టి లక్ష్మీనారాయణ, మాజీ టిడిపి మండల అధ్యక్షుడు నిమ్మకాయల సూర్యనారాయణమూర్తి, నాయకులు లంకే భీమరాజు, కంకటాల రాంబాబు, మల్లాడి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎవేగుళ్ల

సంక్షేమమే ధ్యేయంగా టిడిపి సూపర్ సిక్స్

ప్రజాశక్తి-మండపేట

అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా టిడిపి సూపర్ సిక్స్ మేనిఫెస్టో రూపొందించిందని ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో 10,11,12 వార్డుల బూత్ ఇన్ ఛార్జ్‌లు, కుటుంబ సాధికార సారథులు, నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్ ధరల్లో దేశంలోనే ఎపిని నంబర్-1 స్థానంలో నిలిపిన జగన్ దారుణాలను ప్రజలందరూ పంటిబిగువున భరిస్తున్నారన్నారు. కష్టాలు తీరి, రాష్ట్రం అభివృద్ధి బాట పట్టాలంటే కూటమినే గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు ఉంగరాల రాంబాబు, సాధనాల చక్రపాణి, సిరంగి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు సిబ్బందికి శిక్షణ

ప్రజాశక్తి-అమలాపురం(అల్లవరం)

అల్లవరం వెలుగు కార్యాలయం వద్ద తహశీల్దార్ పి.సునీల్ కుమార్ అధ్వర్యంలో ధాన్యం కొనుగోలుపై గ్రామ వ్యవసాయ సహయకులు, గ్రామ రెవెన్యూ అధికారులు, సొసైటి సెక్రెటరీలకు మండల స్థాయి శిక్షణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో తహశీల్దార్ మాట్లాడుతూ వ్యవసాయ, రెవెన్యూ మరియు వ్యవసాయ సహకార శాఖలు సమన్వయంతో ధాన్యం కొనుగోలు చేయాలి అన్నారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రం లో గోనె సంచులు సిద్ధం చేయాలని అన్నారు.

మండల వ్యవసాయ అధికారి ఎన్‌వివి.సత్యనారాయణ మాట్లాడుతూ అల్లవరం మండలంలో 4297 ఎకరాలలో దాళ్వా వరి సాగు జరుగుతుందని, 16 వేల టన్నుల దిగుబడి వస్తుందన్నారు. 75 కిలోల బస్తాకు సాధారణ రకానికి రూ.1637 మద్దతు ధరతో ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. రైతులు తప్పనిసరిగా 17శాతం లోపు తేమ ఉండేలా చూడాలన్నారు. గ్రామ స్థాయిలో రైతు భరోసా కేంద్రాల పరిధిలోని రైతులకు మద్దతు ధరపై మరియు ధాన్యం కొనుగోలుపై అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎం.దుర్గా శ్రీనివాస్, ఎఎస్ఒ పి.సూర్యనారాయణ, సొసైటీ సెకరెట్రీలు, గ్రామరెవెన్యూ అధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

బెల్ట్ షాపు నిర్వహిస్తున్న వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి-గోపాలపురం

మండలంలోని గోపవరం గ్రామంలో బెల్టుషాపు నిర్వహిస్తున్న పోసిపోయిన ప్రసాద్‌ను అరెస్టు చేశామని సిఐ బాల సురేష్‌బాబు, ఎస్‌ఐ కె.సతీష్‌కుమార్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించామని తెలిపారు. ఈ దాడుల్లో 30 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు. అక్రమంగా మద్యం అమ్మకాలు జరిపితే చర్యలు తప్పవని వారు కుమార్ హెచ్చరించారు.

బైకు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-చాగల్లు

బ్రాహ్మణగూడెం గ్రామంలో బుధవారం ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎళ్ల ఇజ్రాయేలు (73) మృతి చెందాడని ఎస్‌ఐ పి.నాగరాజు తెలిపారు. ఇజ్రాయేలు బైకుపై వెళ్తుండగా ఎదురుగా మరో వ్యక్తి బైకుపై వచ్చి ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఇజ్రాయేలుకు తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని చికిత్స నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు.

123 మద్యం సీసాల స్వాధీనం

ప్రజాశక్తి-కాట్రేనికోన

మండల పరిధిలోని పల్లంకూరు పంచాయతీ శివారు మొల్లేటి మొగ గ్రామంలో బెల్ట్ షాప్ నిర్వహిస్తున్న ఓలేటి గంగాద్రి నుంచి 123 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ నాగేశ్వరావు తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరుస్తామని చెప్పారు. ఆయన వెంట స్టేషను సిబ్బంది మణికంఠ స్వామి తదితరులు ఉన్నారు.

విద్యుత్ షాక్‌తో పెయింటర్ దుర్మరణం

ప్రజాశక్తి - సామర్లకోట

పట్టణంలో జగనన్న కాలనీలో కొత్తగా నిర్మిస్తున్న గృహానికి పెయింటింగ్ వేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై పెయింటర్ బుధవారం దుర్మరణం చెందాడు. రంగంపేట మండలం ముందవరం గ్రామానికి చెందిన ముప్పిడి బులివీర్రాజు (31) పని చేస్తుండా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. అతనిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

11 కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - ఉంగ్రాజవరం

మండలంలో పాలంగి చెక్ పోస్ట్ వద్ద 11 కేజీల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ఇద్దరిని అరెస్టు చేశారు. ఉంగ్రాజవరం ఎస్ఐ. వి.అప్పలరాజు తెలిపిన వివరాల మేరకు బుధవారం చెక్ పోస్ట్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఉంగ్రాజవరం వైపు ఇద్దరు వ్యక్తులు నడిచి వెళ్తున్నారు. పోలీసులను చూసి పారిపోతుండగా వారిని పట్టుకున్నారు. వారి వద్ద ఉన్న రెండు బ్యాగులను తనిఖీ చేశారు. సుమారు 11 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కాకినాడ నుంచి గంజాయిని తీసుకొచ్చి, మండలంలోని పలు ప్రాంతాల్లో అమ్ముకునేందుకు వచ్చినట్టు వారు విచారణలో తెలిపారు. నిందితులు కేరళకు చెందిన పి.రాజీవ్ రవి, కె.సుల్ఫికర్‌గా గుర్తించారు. రెండు సెల్ ఫోన్లు, రూ.300 స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు.

చెక్ పోస్ట్‌ల వద్ద నిరంతర నిఘా

జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హిమాన్షు శుక్లా

ప్రజాశక్తి-అమలాపురం

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవడంతో పాటుగా చెక్ పోస్ట్ ల వద్ద నిరంతర నిఘాను కొనసాగిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి హిమాన్షు శుక్లా వెల్లడించారు. బుధవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి 26 జిల్లాల కలెక్టర్లతో ఫారం పెండెన్సీ, సి విజిల్ ద్వారా కోడ్ ఉల్లంఘన పై అందిన ఫిర్యాదుల పరిష్కార సరళి సువిధ ద్వారా అందిన దరఖాస్తు లకు అనుమతులు మంజూరు కంట్రోల్ రూమ్ పనితీరు, ఎన్నికల సీజర్ మేనేజ్మెంట్ వ్యవస్థ పనితీరు ఇత్యాది అంశాలపై సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫ రెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ మద్యం, డబ్బు గుర్తిస్తే తక్షణమే చర్యలు తను చర్యలు నిబంధనల మేరకు చేపట్టి ఆ యొక్క నివేదికలను సత్వరమే సమర్పించాలని ఆదేశించారు. సాధారణ ఎన్నికల నేపథ్యం లో మద్యం, డబ్బు, విలువైన వస్తువుల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు ఏర్పాటు చేసిన చెక్ పోస్టు ల వద్ద నిరంతర నిఘా ఉంచాలని ఆయన స్పష్టం చేశారు రిటర్నింగ్ అధికారులు చెక్‌పోస్టుల వద్ద కార్యకలాపాలను పరిశీలించి పటిష్ట నిఘాకు అనుస రించాల్సిన వ్యూహాలపై సిబ్బందికి మార్గనిర్దేశం చేయా లన్నారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవా లని, ఇంటినుండే ఓటింగ్ విధానానికి సంబంధించి 85 సంవత్సరాలు పైబడిన వృద్ధులు నిజంగా నడవలేని స్థితిలో ఉన్న దివ్యాంగులను పోలింగ్ కేంద్రాల వారిగా ప్రాథమికంగా గుర్తించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు సి విజిల్ యాప్ జిల్లా స్థాయి కాల్ సెంటర్ లలో కోడ్ ఉల్లంఘ నలు తదితరాలపై వస్తున్న ఫిర్యాదులపై ప్రత్యేక బృందాలు సత్వరమే స్పందించి, సత్వర విచారణ చేపట్టి నాణ్యతతో పరిష్కరించాలని తెలిపారు. పరిష్కారానికి ధి వివరాలను ఫిర్యాదుదారునికి తెలియజేయాల న్నారు.. ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాలో వస్తున్న ప్రతికూల వార్తల పర్యవేక్ష ణకు ప్రత్యేక బృందాలు పనిచేస్తు న్నాయన్నారు. సీజర్ మేనేజ్ మెంట్ వ్యవస్థ పకడ్బందీగా పని చేసే విధంగా ఆర్వోలు చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల ఎక్కువ పని చేస్తున్న ఎవరు కూడా రాజకీయ పార్టీల కార్యక్రమాల్లో పాల్గొనరాదన్నారు. ఎన్నికల కమిషన్ సూచనల మేరకు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేయడాన్ని అధికారులు బాధ్యతగా తీసుకోవా లన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, బస్టాండ్, రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాల్లో రాజకీయ పార్టీల హోర్డింగ్స్, పోస్టర్లు, బ్యానర్లు, ఫొటోలు, లోగోలు ఉండడానికి వీలులేదన్నారు. ప్రయివేటు భవనాలపై కూడా గోడలపై రాతలు, ఫ్లెక్సీలు, బ్యానర్లు ఉండరాదన్నారు. జిల్లాలో కేవలం బ్లూ కలర్ రంగు మాత్రమే వేసిన ప్రభుత్వ భవనా లను, ఓవర్ హెడ్ ట్యాంకులు కోడ్ ఉల్లంఘన కింద పరిగణించరాదని ఆయన స్పష్టం చేశారు రిటర్నింగ్ అధికారులు, ఎంసిసి టీమ్స్ ఎంసిసి అమలును మెరుగైన ప్రాధాన్యంతో ఇవ్వాలని సూచించారు. సంబంధిత అధికారులు ఎంసిసి అమలు పై ప్రతిరోజూ పరిశీలన చేస్తూ ఉండా లన్నారు. ఈ కార్యక్రమంలోజిల్లా జాయింట్ ఎస్.నుపూర్ అజయ్, అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులు ఎస్.సుధాసాగర్, జి.కేశవర్ధన్ రెడ్డి, మదన్‌మోహన్‌రావు, డి.ఎల్లారావ్, ఎవివి.సత్యనారాయణ, పార్లమెంట్ సహాయ రిటర్నింగ్ అధికారి, ఎన్నికల సెక్షన్ సూపరింటెండెంట్ టి.వైద్యనాథ్ శర్మ, ఎఒ సిహెచ్.వీరాంజనేయ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశం లో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఇతర ఉన్నతాధికారులు

పోలింగ్‌కు గైర్హాజరైన ఓటర్ల కోసం పోస్టల్ బ్యాలెట్

పోలింగ్ విధులలో పాటుగా వివిధ అత్యవసర సేవల్లో ఉంటూ పోలింగ్ రోజు గైర్హాజ రయ్యే ఓటర్లకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే అవకాశాన్ని కేంద్ర ఎన్నికల సంఘం కల్పించిందని అందుకు అనుగుణంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా నోటిఫికేషన్ జారీ చేశారని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లోక్ సభతో పాటు అసెంబ్లీకి త్వరలో సార్వత్రిక ఎన్ని కలు జరగనున్న నేపథ్యంలో వివిధ అత్యవసర సేవల్లో నిమగ్నమయ్యే 33 శాఖలకు చెందిన ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కు వినియోగించుకోవచ్చని నోటిఫికేషన్ లో స్పష్టం చేశారన్నారు. ఇందు కోసం ప్రత్యేకంగా నోడల్ అధికారిని నియమించడంతోపాటు పోస్టల్ బ్యాలెట్లు సంబంధించిన 12-డి పత్రాలను అందుబాటులో ఉంచ డంతోపాటు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కొరకు దరఖాస్తు చేసుకున్న ఓటర్లకు వారి అర్హతలను పరిశీలించి జాబితాను రూపొందించి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ఎప్పుడు వేయాలి అనే విషయాలను ముందుగా తెలియ జేస్తారన్నారు. ఆ రోజున హాజరై తమ ఓటు హక్కును సద్వినియోగ పరచుకోవచ్చన్నారు. ఈ పోస్టల్ బ్యాలెట్ కు మెట్రో రైలు, రైల్వే రవాణా సేవలు, పోలింగ్ రోజు కార్యకలాపాలను కవర్ చేయడానికి ఎన్నికల కమిషన్ ఆమోదంతో అధికారిక లేఖలు జారీ చేయబడిన మీడియా వ్యక్తులు, విద్యుత్ శాఖ, బిఎస్ఎన్ఎల్, పోస్ట్-టెలి గ్రామ్, దూరదర్శన్, ఆల్ ఇండియా రేడియో, రాష్ట్ర మిల్క్ యూనియన్, మిల్క్ కో- ఆపరేటివ్ సొసైటీలు, ఆరోగ్య శాఖ, ఫుడ్ కార్పొరేషన్ డిపార్ట్మెంట్, విమానయానం, రోడ్డు రవాణా సంస్థ, అగ్నిమాపక సేవలు, ట్రాఫిక్ పోలీస్, అంబులెన్స్ సేవలు, షిప్పింగ్, అగ్ని మాపక శాఖ, జైళ్లు, ఎక్సైజ్, వాటర్ అథారిటీ, ట్రెజరీ సర్వీసెస్, అటవీ శాఖ, సమాచార, ప్రజా సంబంధాల శాఖ, పోలీస్, పౌర రక్షణ-హోంగార్డులు, ఆహార పౌర సరఫరాలు- వినియోగదారుల వ్యవహారాలు, ఇంధన శాఖ, ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా, ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో, డిపార్ట్మెంట్ ఆఫ్ పిడబ్ల్యుడి, నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్స్, విపత్తు నిర్వహణ సంస్థ ఉద్యోగులు అర్హులని ఆయన తెలిపారు.

ఇవిఎంలపై అధికారులకు అవగాహన

ప్రజాశక్తి-అమలాపురం

ప్రిసైడిం గ్ అధికారులు సహాయ ప్రిసైడింగ్ అధికారుల మొదటి శిక్షణ కార్యక్రమంలో రెండో రోజైన బుధవారం స్థానిక గోదావరి భవన్ నందు పబ్లిక్ హెల్త్ మరియు కుటుంబ సంక్షేమం, కో ఆపరేటివ్ సొసైటీ రిజిస్టర్ కార్యాలయాలు, పురపాలక సంఘాల ఉద్యోగులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహనను పెంపొం దించారు. అదేవిధంగా ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు వినియోగంపై భౌతికంగా అవగాహనను కల్పిం చారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రానున్న పార్లమెంటు, అసెంబ్లీ సార్వత్రిక ఎన్నికల పోలింగుకు సంబంధించి 6 కవర్లలో ఎన్నికల మెటీరియల్స్ సీలింగ్ చేయాల్సి ఉంటుందని అన్నారు. ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రం వద్ద పోలింగ్ ముఖ్యమైన ఎన్నికల సామగ్రి ఎనజ్జర్-3, వివి ప్యాడ్ కి సంబంధించిన అదనపు పోలింగ్ మెటీరియల్ చెక్ లిస్టు ప్రకారం ఉందో లేదో పరిశీలన చేయాల న్నారు. సెక్టార్ అధికారి సమన్వయంతో కేటాయించిన పోలింగ్ కేంద్రానికి చేరుకోగానే పోలింగ్ కేంద్రం పరిసరాలను పరిశీలించి బిఎల్ఒ సహకారంతో రూట్ 100 మీటర్ల వ్యాసార్ధం లోపు ఎటువంటి ప్రసార సామాగ్రి లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు పోలింగ్ కేంద్రంలో ఏమైనా రాజకీయ నాయకుల ఫొటోలు ఉంటే తొలగించడం లేదా కప్పి ఉంచడం కానీ చేయాలన్నారు. పోలింగ్ ప్రాంతం మరియు పోలింగ్ కేంద్రం వెలుపల అభ్యర్థులు జాబితాలను చూపుతున్న నోటీసులు అతికిం చాలన్నారు. పోలింగ్ కేంద్రంలో ఆ రాత్రికి తప్పనిసరిగా నిద్రించాలని సూచించారు .పోలింగ్ స్టేషన్ యొక్క నమూనా లేఔట్ ను రూపొందించు కొని ఆ ప్రకారం పోలింగ్ స్టేషన్ను ఏర్పాటు చేసుకోవాలన్నారు పోలింగ్ సిబ్బందితో పోలింగ్ బూత్ ను సిద్ధం చేయడం పారాలు కవర్లు మొదలైన సన్మార్గం చేయుట బంద సభ్యుల యొక్క సామర్థ్యాలను అనుభవాలను పరిగణన లో తీసుకుని విధులు కేటాయించా లన్నారు ఇవిఎంలు సీలింగు వంటి ప్రక్రియలను ముగించుకొని మాక్ పోలింగ్ పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో నిర్వహించాలన్నారు పి ఓ డిక్లరేషన్ మేరకు పోలింగ్ ప్రారంభించాల న్నారు. డిఆర్‌డిఎ పీడీ వి. శివశంకర్ ప్రసాద్ మాట్లాడుతూ మార్కుడు కాపీలో పురుష ఓటర్లకు సంబంధించి వెడ్డింగ్ తో క్రాస్ గా మార్క్ చేస్తారని, స్త్రీ ఓటర్ లకు సంబంధించి క్రాస్ మార్కుకు అదనంగా సీరియల్ నెంబర్ను ఎరుపు వత్తాకారంలో మార్కింగ్ చేస్తార న్నారు, ట్రాన్స్ జెండర్ ఓటర్ లకు స్టార్ గుర్తులు పెడతారన్నారు. పురుషులు మరి యు మహిళా ఓటర్లకు ప్రత్యేక క్యూ లైన్లు ఉండేలా చూసుకో వాలన్నారు. 17 సి ఫారం నిర్వహణ పట్ల ప్రతి ఒక్కరు అవగాహనను పెంపొం దించుకొని ప్రతి అంశాన్ని పూర్తి అవగాహనతో నింపుతూ పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగించాలని సూచించారు. కార్యక్ర మంలో మాస్టర్ ట్రయినర్ ప్రకాష్, కలెక్టరేట్ ఎఒ సిహెచ్.వీరాంజనేయ ప్రసాద్, ప్రిసైడింగ్ సహాయ ప్రిసైడింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



ఇవిఎం, వివి ప్యాట్‌లపై శిక్షణ కార్యక్రమం

ధాన్యం కొనుగోలుపై శిక్షణ

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ప్రస్తుత 2023-34 రబీ సీజన్లో రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజకూ మద్దతు ధర కలిపించే విధంగా, వారి నుంచి కొనుగోళ్లు చేపట్టడం కోసం సమన్వయం సాధించడంలో అధికారులు, సిబ్బంది బాధ్యత వహించాలని కలెక్టర్ కె.మాధవీలత ఆదేశించారు. బుధవారం వెంకటేశ్వర ఆనం కళా కేంద్రంలో మార్కెటింగ్, పౌర సరఫరాలు, వ్యవసాయ, రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బందికి రబీ సీజన్‌లో ధాన్యం కొనుగోలు విధానంపై సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె.మాధవీలత మాట్లాడుతూ ప్రస్తుత 2023-24 రబీ సీజన్లో జిల్లా పరిధిలో రైతులు పండించిన పంట ప్రతి గింజకూ మద్దతు ధర కలిపించే విధంగా అధికారులు కృషి చేయాలన్నారు. రైతులు పండించిన పంటను పొలం వద్ద నుంచి, కొనుగోలు కేంద్రాలకు, అక్కడ నుచి మిల్లర్ల వద్దకు తీసుకు వచ్చే క్రమంలో వివిధ దశల్లో చెయ్యవలసిన పనులు, అంశాలపై ఒక ప్రణాళిక తయారు చేసుకోవాలని అన్నారు. రైతులకు, మిల్లర్లకు మధ్య దళారుల ప్రమేయం లేకుండా చూడాలని, అధికారుల ప్రమేయంతోనే ధాన్యం కొనుగోలు జరిగే విధంగా చూడాలని ఆమె అన్నారు. రైతులు కోతలు కోసి కుప్పలు వేసిన తరువాత ధాన్యాన్ని బస్తాలకు ఎత్తే సమయంలో వారికి గోనెసంచుల కొరత లేకుండా, హమాలీల కొరత లేకుండా ముందుగానే జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రైతులకు ఎన్ని గోనె సంచులు అవసరం అవుతాయో ముందుగానే వారి వద్ద నుండి డినామినేషన్ తీసుకోవాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున మిల్లుల వద్ద ఎటువంటి రాజకీయ నాయకుల ఫోటోలు లేకుండా చూడాలన్నారు. జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్ మాట్లాడుతూ జిల్లాలో రైతులు పండించిన పంట పొలం లోని కళ్లాల వద్ద నుంచి మిల్లర్ల వద్దకు వచ్చి వారికి మద్దతు ధర కల్పించేంత వరకు అధికారులు బాధ్యత వహించాలన్నారు. ఈ రబీ సీజన్‌లో 3.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యాలను నిర్ధేశించినట్లు చెప్పారు. ధాన్యం సేకరణ సమయంలో శాంపిల్స్, వాటి విశ్లేషణ, పాటించాల్సిన ప్రమాణాలు, తేమ శాతం, వ్యర్థాల శాతం, తదితర అంశాలపై శిక్షణ నిర్వహిస్తున్నామని తెలిపారు. అదే సమయంలో సాంకేతిక పరమైన డేటా ఎంట్రీ, ట్రిప్ షీట్, తదితర అంశాలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. దళారుల ప్రమేయం లేకుండానే నేరుగా కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు అత్యంత పారదర్శకంగా నిర్వహించాల్సి ఉంటుందన్నారు. రైతులు ధాన్యం అమ్మకానికి మిల్లర్ల వద్దకు తీసుకు వచ్చిన తరువాత మిల్లర్లతో ఎటువంటి సమస్యలూ లేకుండా అక్కడ ఉన్న అధికారులే చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు ధాన్యాన్ని మిల్లు వద్దకు తీసుకు వచ్చిన తరువాత వారిని ఎక్కువ సమయం వేచి ఉండకుండా, వాటిని తిరిగి వెనుకకు పంపకుండా ఎటువంటి సాంకేతిక సమస్యలు లేకుండా జాగ్రత వహించాన్నారు. జిల్లాలో 231 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 3.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ చేపట్టనున్నట్లు తెలిపారు. ఽఈ శిక్షణ కార్యక్రమంలో కొవ్వూరు సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, రాజమహేంద్రవరం ఆర్‌డిఒ ఎ.చైత్ర వర్షిణి, పౌర సరఫరాల శాఖ డిఎం టి.రాధిక, డిఎస్ఒ పి.విజయ భాస్కర్, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్ మాధవరావు, మార్కెటింగ్ ఎడి ఎం.సునీల్ వినయ్ పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎస్ఐ

ప్రజాశక్తి-తాళ్లపూడి

వేసవిలో ప్రజలకు చల్లని మంచినీరు అందించడం అభినందనీయమని తాళ్లపూడి ఎస్ఐ శ్యామ్‌సుందర్ అన్నారు. తాళ్లపూడి బస్టాండ్ సెంటర్లో న్యూ యువ శక్తి ఆటో యూనియన్ ఏర్పాటు చేసిన మంచినీటి చలివేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ అధ్యక్షులు రజిని కుమార్ మాట్లాడుతూ ప్రజలకు ప్రయాణికులకు ఈ చలివేంద్రంలో ప్రతిరోజు చల్లని మంచినీరు వారంలో ఒకరోజు మజ్జిగ తదితర చల్లని పానీయాలు అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వీరితోపాటు ఆటో యూనియన్ సభ్యులు మంగరాజు, వీరబాబు, దాస్, ప్రతాప్, రాయుడు, ఏడుకొండలు, శ్రీను, మోషే తదితరులు ఉన్నారు.

మత్స్యకార సంఘాలను బలోపేతం చేయాలి

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

మత్స్యకార సంఘా లను బలోపేతం చేయడానికి కృషి చేయాలని మత్స్యకార శాఖ ఉద్యోగులు, ట్రాన్సేటర్స్ ఎం.జగదీశ్వరి, ఎస్.పైడి తల్లి తెలిపారు. బుధవారం ఉప్పాడ మత్స్యకార సమైక్య కార్యాలయంలో జరిగిన సమావేశంలో కాకినాడ, ఢిల్లీ, కేరళ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, కర్ణాటక, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన ఐఐ ఎఫ్‌టి, ఐపిఎం, ఎంబిఎ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు, స్థితిగతులు తెలుసుకోవడానికి సంఘాల సభ్యుల స్థితిగతులు, విద్య, ఆరోగ్యం పట్ల గ్రామీణ ప్రాంతంలో ఉన్న వాస్తవ పరిస్థితులు అవగాహన కల్పించారు. సంఘాలు బలోపేతం కావడం ద్వారానే గ్రామీణ ప్రాంతాల్లో మహిళల అభివృద్ధి సాధిస్తారని తెలిపారు.

స్థానికులకు ఉపాధి కల్పించాలి

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ పోర్ట్‌లో స్థానికులకే ఉపాధి అవకాశాలు కల్పించాలని సిఐటియు జిల్లా కోశాధికారి ఎంవి.రమణ డిమాండ్ చేశారు. కాకినాడ పోర్టులో సర్వేయర్స్‌గా, టాలీ వర్కర్లుగా ఏళ్ల తరబడి పనిచేస్తున్న కార్మికులు బుధవారం యూనియన్‌ను ఏర్పాటు చేసుకున్నారు. ఈ నేపథ్యంలోనే యూనియన్ ప్రతినిధి వర్గం ది కాకినాడ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులను కలి సేందుకు వెళ్లారు. అయితే ఆయన అందుబాటులో లేకపోవడంతో తమ సమస్యలను పరిష్కరిం చాలని కోరుతూ ఆయన కార్యాలయ సిబ్బందికి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కోశాధికారి ఎంవి.రమణ మాట్లాడారు.

దేశాభివృద్ధిలో యువత ఓటు కీలకం

ప్రజాశక్తి-గోపాలపురం

బలమైన ప్రజాస్వామ్యానికి, దేశ అభివృద్ధికి యువత ఓటు చాలా కీలమని కొండవీటి విద్యాసంస్థల సెక్రెటరీ, కరస్పాండెంట్ కెఎస్‌డి.ఆశీర్వాదం, నెహ్రూ యువ కేంద్రం సభ్యులు అన్నారు. బుధవారం గోపాలపురం శ్రీ గౌతమి జూనియర్ కళాశాలలో భారతీయ యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ నెహ్రూ యువ కేంద్రం కాకినాడ జిల్లా యూత్ ఆఫీసర్ దూలం కిషోర్ ఆదేశాల మేరకు ఓటర్ ఎవేరెనెస్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. నారీ శక్తి కార్య క్రమాన్ని నిర్వహించారు. అనంతరం వాలీబాల్, కబడ్డీ, రన్నింగ్ పోటీల్లో విజేతలకు మెడల్స్ అందజేశారు.

వెంకన్న హుండీ లెక్కింపు

ప్రజాశక్తి-పెరవలి

అన్నవరప్పాడులోని శ్రీవెంకటేశ్వర స్వామి దేవస్థానంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం వేలివెన్ను గ్రూపు టెంపుల్స్‌లో బుధవారం హుండీలు లెక్కింపు చేపట్టారు. 30 రోజులకు రూ.3,03,184 నగదు, 39 గ్రాముల వెండి వచ్చినట్టు దేవస్థానం కార్యనిర్వాణ అధికారి ఎం.రాధాకృష్ణ తెలిపారు.

'ఆదిత్య'లో ఘనంగా గ్రాండ్ స్కిల్ ఎక్స్‌పో

ప్రజాశక్తి - కాకినాడ

స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో గ్రాండ్ స్కిల్ ఎక్స్పో - 2024 ఫెస్ట్ ఘనంగా జరిగింది. బుధవారం జరిగిన ఈ కార్యక్రమానికి అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్. నాయుడు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల మానసిక, శారీరక దారు ధ్యానికి క్రీడలు మరియు సాంస్కృతిక కళలు ఉపయోగపడతాయని అన్నా రు. ఆదిత్య డిగ్రీ కళాశాలలో ప్రతినెల స్కిల్ ఎక్స్పో పేరిట విద్యార్థులలో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు పోటీలు నిర్వహిస్తామని, ప్రతినెల నిర్వ హించిన కార్యక్రమాల తర్వాత ఆయా అంశాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గ్రాండ్ స్కిల్ ఎక్స్ పో పేరిట ఒక ఫెస్ట్ నిర్వహించి విజేతలకు ప్రశంసా పత్రాలను జ్ఞాపికలను అందిస్తామని అన్నారు. ఈ కారక్రమంలో పాల్గొన్న ఇస్రో మాజీ సైంటిస్ట్ యాళ్ల శివప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు చదువులోనే కాకుండా అన్ని రంగాలలోనూ రాణించాలని అన్నారు. అనంతరం వివిధ పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను, జ్ఞాపికలను అందించారు. కార్యక్రమాన్ని నిర్వహించిన అధ్యాపక బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణ రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణ, క్యాంపస్ ఇన్‌ఛార్జ్ మూర్తి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జనసేన పార్టీ ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

వేమవరంలో జనసేన పార్టీ ఆత్మీయ సమావేశం బుధవారం నిర్వహిం చారు. సమావేశంలో రానున్న కాలంలో అమలాపురంలో జనసేన పార్టీని ఎలా నడిపించుకోవాలి అనే దానితో పాటు పొత్తులో భాగంగా మిత్ర పార్టీలైన టిడిపి, బిజెపిల వద్ద అమలాపురం జనసేన పార్టీ కార్యకర్తల భవిష్యత్తుకు అడగాల్సిన హామీలపై చర్చిం చారు. వెంటనే ఇక్కడి పరిస్థితులను పార్టీ అధిష్టానానికి తెలియజేసి తదుపరి ఉమ్మడి అభ్యర్థి యొక్క బలోపేతంపైనా, ఉమ్మడి కార్యాచరణ పైనా మరోసారి సమావేశమై ముందుకు సాగుదామని ఈ సమావేశం తీర్మానం చేసింది.రాబోయే ఎన్నికల్లో పొత్తులో భాగంగా అమలాపురం అసెంబ్లీ టిక్కెట్ టిడిపి కేటాయించడంతో జనసేన పార్టీ క్యాడర్లో నైరాస్యం నెలకొంది. ఇటీవల పార్టీ ఇంచార్జి శెట్టిబత్తుల రాజబాబు వైసిపి జిల్లా కో-ఆర్డినేటర్ మిథున్ రెడ్డిని కలవడంతో నియోజకవర్గ జనసేనలో మరింత నిరుత్సాహం ఏర్పడింది. ఈ తరుణంలో పార్టీలోని పెద్దలు నాలుగు రోజులుగా పార్టీలో ఉన్న రెండు వర్గాలను సమన్వయ పరచడానికి ప్రయత్నాలు చేస్తూ వచ్చారు. పార్టీ కోసమే అంతా కలిసి పనిచేయాలని ఒక నిర్ణయానికి వచ్చారు. కార్యక్రమంలో పెద్దలు సలాది వెంకట రమణ, నల్లా శ్రీధర్, మాజీ మున్సిపల్ చైర్మన్ యాళ్ల నాగ సతీష్, సీనియర్ నాయకులు కంచిపల్లి అబ్బులు, మున్సిపల్ ప్రతిపక్ష నేత యేడిద శ్రీను, ఇసుక పట్ల రఘు బాబు, అయితాబత్తుల ఉమామహేశ్వరరావు, పడాల శ్రీదేవి నానాజీ, లింగోలు పండు, ఆర్‌డియస్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికునికి సన్మానం

ప్రజాశక్తి -దేవరపల్లి

మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో మాజీ సైనికుడు నాయక్ కొయ్య అబ్బులును ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ మానవత సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. మానవత సంస్థలో తాను కూడా క్రియాశీల కంగా సేవలు అందిస్తానని, రిటైర్డ్ ఇండియన్ ఆర్మీ సభ్యులు కూడా సేవా కార్యక్రమాలలో పాల్గొని సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. మానవత సేవా సంస్థ రాష్ట్ర కన్వీనర్ బలుసు సత్యనారాయణ నాయక్‌ను సన్మానించి మానవత షీల్డ్ అందించారు. ఆయన సేవలను అభినందించారు.

విద్యార్థులకు మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి-తాళ్లపూడి

పెరుగుతున్న ఎండ కారణంగా పాఠశాల విద్యార్థులకు స్కూళ్లు ముగిసే వారకూ వాత్సల్య మెడికల్ షాప్ యజమాని మల్లిపూడి చిన వెంకటేశ్వరరావు మజ్జిగ అందజేస్తున్నారు. ఆయనతో కలిసి రాగోలపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దున్నా దుర్గారావు విద్యార్థులకు మజ్జిగ పంపిణీ చేశారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికులు వరలక్ష్మి, పాల్గొన్నారు.

సమాజ అభివృద్ధికి దోహదపడేలా పరిశోధనలు

ప్రజాశక్తి - కాకినాడ

సమాజ అభివృద్ధికి దోహద పడేలా విద్యార్థులు నూతన పరిశోధనలను ఆవిష్కరిం చాలని జెఎన్‌టియుకె ఉపకులపతి ప్రొఫెసర్ జివిఆర్.ప్రసాద రాజు పిలుపు నిచ్చారు. బుధవారం జెఎన్‌టియుకె డిజైన్ ఇన్నోవేషన్ సెంటర్ ఆధ్వర్యంలో నేషనల్ ఇనీషియేటివ్ ఫర్ డిజైన్ ఇన్నోవేషన్ సహకా రంతో రెండు రోజులపాటు జరిగే ఇన్నోవేషన్ ఫెయిర్ ఎగ్జిబిషన్‌ను ఆదికవి నన్నయ యూని వర్శిటీ ఉపకులపతి ప్రొఫెసర్ కె.పద్మ రాజుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించి సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలను చేపట్టాలన్నారు. ఇన్నోవేషన్ ఫెయిర్ ఎగ్జిబిషన్లో విద్యార్థులు చాలా సృజనాత్మ కమైన ఆవిష్కర ణలను ప్రదర్శించడం జరిగింద న్నారు. సమాజానికి, రైతులకు ఇతర రంగాలకు ఉపయోగ పడేలా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన పరికరాలను ఈ ఎగ్జిబిషన్లో ప్రదర్శించా రన్నారు. విద్యార్థులు ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై పట్టు సాధించి సరికొత్త ఆవిష్క రణలు చేపట్టాలని పిలుపునిచ్చారు. నన్నయ విసి ప్రొఫెసర్ కె.పద్మరాజు మాట్లాడుతూ ఇటువంటి ఇన్నోవేషన్ ఫెయిర్లలో విద్యార్థులు పాల్గొనడం ద్వారా వారికి పరిశోధనలపై మరింత ఆసక్తి పెరుగుతుందని, తద్వారా సమాజాభివృద్ధికి తోడ్పడే ఆవిష్కరణలను రూపొందించేందుకు వీలు కలుగుతుం దన్నారు. రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యా లయాలు, కళాశా లలకు చెందిన విద్యార్థులు సృజనాత్మకమైన ఆవిష్కరణలను ప్రదర్శించడం అభినందనీయమన్నారు. ఇన్నో వేషన్ ఫెయిర్‌లో భాగంగా రాష్ట్రవ్యా ప్తంగా వివిధ కళాశాలల నుంచి 200కు పైగా నమూ నాలను ప్రదర్శించడం జరిగిం దని డిజైన్ ఇన్నోవేషన్ సెంటర్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎ.గోపాలకృష్ణ అన్నారు. ఈ ప్రదర్శనలో అత్యుత్తమైన నమూ నాలకు నగదు బహు మతులను అందజేయడం జరుగు తుందన్నారు. రెండు రోజుల పాటు జరగనున్న ఇన్నోవేషన్ ఫెయిర్ ఎగ్జిబిషన్ను నగర ప్రజలు, పాఠశాల, కళాశాలల విద్యార్థులు ఉచితంగా సందర్శించవ చ్చుని అన్నారు.

వైసిపి ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలి

ప్రజాశక్తి -ఆత్రేయపురం

పేదల సంపదను దోచుకునే వైసిపి ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని నియోజకవర్గ టిడిపి పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారు సత్యానందరావు అన్నారు. బుధవారం మండలంలోని మెర్లపాలెం గ్రామంలో అమలాపురం పార్లమెంట్ అభ్యర్థి గంటి హరీష్ మధూర్ కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సత్యానందరావు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం హామీలన్నీ తుంగలో తొక్కి ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. వచ్చే ఎన్నికలలో పార్లమెంట్ అభ్యర్థిగా హరీష్ ను, అసెంబ్లీ అభ్యర్థిగా నన్ను గెలిపించాలని కోరారు. హరీష్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం కొత్తపేట నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడంలో విఫలమయ్యిందని ఆరోపించారు.